నిలిచిన బిల్లులు.. ఆగిన పనులు

తెనాలి మున్సిపాలిటీలో దుస్థితి
- మార్చి నుంచి నిలిచిన బిల్లుల చెల్లింపులు
- నిలిచిపోతున్న అభివృద్ధి పనులు
- రేపు సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు


మారీసుపేట రెండు గేట్ల మధ్యలో పనులు ప్రారంభం కాని రోడ్డు


ఇందిరానగర్ కాలనీలో రోడ్డు దుస్థితి

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ అభివృద్ధి ఒకడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న చందానా సాగుతుంది. పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి వర్కు ఆర్డర్‌లు ఇచ్చినా బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందనే నేపంతో అభివృద్ధి పనులు ప్రారంభం కావటం లేదు. ఏడాది నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో పట్టణంలో అభివృద్ధి కుంటుపడుతుంది. తెనాలి పట్టణం 16.77కి.మీ మేర విస్తీర్ణంలో ఉంది. దీనిలో 55,917 నివాస గృహాలున్నాయి. 2.60 లక్షల జనాభాతో ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద పట్టణంగా తెనాలి విస్తరించింది. జిల్లాలోనే ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా దీనికి పేరుంది. ప్రతి ఏడాది వివిధ పన్నులు, షాపు, రూంల అద్దెలు వంటి వాటి ద్వారా రూ.36 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఇవికాకుండా 15వ ఆర్థిక సంఘం, ఇతర గ్రాంట్‌ల ద్వారా సుమారు రూ.50కోట్ల వరకు సమకూరుతుంటాయి.

ఏడాదికి సగటున 250 పనులకు టెండర్లు

జిల్లాలో ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న తెనాలి పట్టణంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. ఏడాదికి సగటున 250 అభివృద్ధి పనులకు ఇంజినీరింగ్ అధికారులు టెండర్లు పిలుస్తుంటారు. మున్సిపల్ కౌన్సిల్ అనుమతి తీసుకుని ప్రక్రియ ప్రారంభించి పనులు దక్కించుకున్న వారికి వర్క్ ఆర్డర్‌లు ఇస్తుంటారు. అనంతరం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉంటుంది. గతేడాది మార్చి నుంచి ఇప్పటివరకు 173 అభివృద్ధి పనులకు వర్క్ ఆర్డర్‌లు ఇచ్చారు. వీటిలో 99 పనులను పూర్తి చేయించారు. 19 పనులు జరుగుతూ ఉండగా, 25 పనులు నేటికి ప్రారంభం కాలేదు. 30 పనులను వివిధ కారణాలతో హోల్డ్(ఎల్‌ఓఏ స్థాయి)లో పెట్టారు. ఇవి కాకుండా టెండర్ల దశలో 50 పనులు, టెండర్లు పిలవాల్సినవి 27 ఉన్నాయి. వీటి కోసం అధికారులు సుమారు రూ.3 కోట్లు వెచ్చించారు.

మార్చి నుంచి నిలిచిన బిల్లుల చెల్లింపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తు వస్తున్నారు. గతేడాది చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో జాప్యం జరగటంతో కాంట్రాక్టర్‌లు పూర్తిగా పనులు నిలిపివేశారు. మార్చి నెలఖరులో నగదు పడతాయనే భావనలో ఉన్న వారికి ప్రభుత్వం నిరాశ మిగిల్చింది. చెల్లింపుల వ్యవస్థలో మార్పులు తెస్తున్నట్లు ప్రకటించి జాప్యం చేసింది. నేటికీ తెనాలి మున్సిపాలిటీ పరిధిలో రూ.7 కోట్ల చెల్లింపులు జరగాల్సి ఉంది. ప్రస్తుతం తెనాలి పురపాలక సంఘం ఖాతాలో రూ.16 కోట్ల నిధులు ఉన్నాయి. కానీ చెల్లింపులు మాత్రం మందకొడిగా జరుగుతున్నాయి. దీంతో తెనాలి పట్టణంలో అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పవచ్చు. ఆదివారం యడ్లలింగయ్య కాలనీలో పర్యటించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి ఆప్రాంత వాసులు రోడ్ల నిర్మాణాలలో జరుగుతున్న జాప్యాన్ని తెచ్చారు. మంగళవారం కాంట్రాక్టర్‌లు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఈసమావేశంలో అయిన దీనికి పరిష్కారం లభిస్తుందో లేదో వేచిచూడాల్సి ఉంది.

అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు



తెనాలి పట్టణంలో పలు అభివృద్ధి పనులలో జాప్యం జరిగిన మాట వాస్తవం. వాటిని వేగవంతం చేయాలని ఇప్పటికే కాంట్రాక్టర్‌లకు సూచించాము. ఇప్పుడిప్పుడే బిల్లుల చెల్లింపులు ప్రారంభం అయ్యాయి. దీంతో కాంట్రాక్టర్‌లు కూడ పనులు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నారు. వీటిని వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఆకుల శ్రీనివాసరావు, ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజనీర్, తెనాలి

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొల్లిపర: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలోని కొల్లిపర సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు మరమ్మతుల నిమిత్తం కొల్లిపర, గుడిబండి వారి పాలెం, కొత్త బొమ్మువానిపాలెం గ్రామాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామని, విద్యుత్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు తెనాలిలో...

తెనాలిటౌన్: తెనాలి పట్టణ, రూరల్ పరిధిలో పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బోరుగడ్డ అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని గాంధీచౌక్, బోసురోడ్డు, కొత్తపేట, ప్రకాశం రోడ్డు, రజకచెరువు, రూరల్ పరిధిలోని అంగలకుదురు, చావావారిపాలెం, జగ్గడిగుంటపాలెం, టిడ్కో గృహాలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. ఆయా ఏరియాలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

మిద్దె సాగుదారులకు విత్తనాల పంపిణీ



తెనాలిరూరల్: పట్టణంలో మిద్దెలపై సాగు చేస్తున్న వారికి సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ గ్రూపు సభ్యులు విత్తనాలను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. తోటకూర, పాలకూర, బచ్చలికూర వంటి ఆకుకూరలు, వంగ, బీర, బెండ, సొర, కాకర, బీన్స్, చిక్కుడు కాయగూరల విత్తనాలతో పాటు పూల మొక్కల అంట్లను సుమారు 100 మందికి ఉచితంగా అందజేశారు. సూర్యదేవర కృష్ణదేవ్, ప్రభంజన్, రాధిక, జ్యోతి పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



తెనాలి: ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం సభ్యుడు ముద్దాభక్తుని సాయికృష్ణ – దివ్య కుమారుడు ముద్దాభక్తుని నాగకౌశిక్ అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేశారు. సేవాకేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మంలను తల్లిదండ్రులు మొదటి దైవంగా భావించి వారికి సేవచేయాలని కోరారు. ఆశ్రమ నిర్వాహకులు భారతి – మురళి, అనూష, జగదీశ్వరి, యేసుబాబు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



తెనాలి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక, గుంటూరు కమిటీ ఆధ్వర్యంలో కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి – ఇందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు టీవీ కృష్ణారావు, ఆర్.రామకృష్ణ, బ్యాంకు శ్రీను, బి.శివలింగంనాయక్, టి.బ్రహ్మం, పట్టాభి శ్రీను, బి.రామోజీనాయక్, ఫణిదరం శివ, ఎస్‌కే దిల్షా పాల్గొన్నారు.

వైభవంగా కైలాసగౌరి వ్రతం



తెనాలి: స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీదుర్గాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మశ్రీ కొండూరి శృంగేరి, జ్యోతి దంపతులచే 'కైలాసగౌరి వ్రతం' వైభవంగా నిర్వహించారు. 114 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ దేవాలయంలో కొన్ని వేల కైలాసగిరి నోములు జరిగాయి. స్త్రీలు తమ సౌభాగ్య, దీర్ఘసుమంగళిత్వం కోసం ఈ వ్రతాన్ని చేస్తారు. దీనిలో ఇచ్చినవారు, పుచ్చుకొన్నవారు ఇద్దరూ అమ్మ కృపకు పాత్రులై సమస్త సౌభాగ్యాలు పొందుతారని ప్రతీతి. నోములో భాగంగా ముత్తయిదువులను అమ్మ స్వరూపంగా భావించి, అయిదు కుంచాల పసుపు, అయిదు కుంచాల కుంకుమను తమ దోసిళ్లతో పంచిపెట్టారు. కార్యక్రమాన్ని వైదిక విధానంలో ఆచరించారు. పెద్దసంఖ్యలో ముత్తయిదువలు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. పట్టణంలోని సమస్యలపై అర్జీలు అందజేయవచ్చునని చెప్పారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

తెనాలి పోలీసుల చర్య సమర్థనీయమే

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

తెనాలిరూరల్: తెనాలిలో గంజాయికి బానిసలైన రౌడీషీటర్లు కానిస్టేబుల్ చిరంజీవిపై దాడి చేసిన సందర్భంలో వారిపై పోలీసులు తీసుకున్న చర్యలు సమర్థనీయమేనని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ చర్య ద్వారా రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగదారులు, రౌడీలు, గూండాలకు సరైన గుణపాఠం చెప్పినట్లయిందన్నారు. రౌడీ షీటర్లను విచారణ నిమిత్తం రమ్మన్న కారణంగానే ఓ బీసీ బిడ్డయిన చిరంజీవిపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. నిందితులు దళితులైనంత మాత్రాన కుల సంఘాలు వత్తాసు పలకడం దారుణమన్నారు. వాస్తవంగా దళితులకు అన్యాయం జరిగితే పోరాటానికి తాము సిద్ధమేనని, కానీ ఇలా హంతకులకు, రౌడీలకు మద్దతు ఇస్తే, కుల సంఘాల ఐక్యత దెబ్బతింటుందన్నారు. నిజంగా దళితులకు అన్యాయం జరిగితే దళిత సంఘాలతో పాటు బీసీ సంఘాలు కూడా పోరాడటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రౌడీషీటర్లు, హంతకులకు కుల సంఘాలు మద్దతివ్వడం శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుంని శంకరరావు అభిప్రాయపడ్డారు.

ముగిసిన ఈత శిక్షణ శిబిరం


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న సీఐడీ ఎస్పీ చక్రవర్తి

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని అమరావతి రోడ్డులో గల ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల ఈత శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి విచ్చేసి మాట్లాడారు. రామేశ్వరంలోని ధనుష్కోటి నుంచి శ్రీలంక వరకు 36 కి.మీ. తాను స్విమ్మింగ్ చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ శిబిరంలో 215 మంది చిన్నారులు ఈతలో శిక్షణ పొందారని అన్నారు. అనంతరం అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన గంధం క్వీనీ విక్టోరియాను ఘనంగా సత్కరంచారు. ఈ సందర్భంగా క్వీనీ విక్టోరియా మాట్లాడుతూ.. ఆక్వా డెవిల్స్ తనకు అందించిన సహకారాన్ని మరువలేనని అన్నారు. శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారులకు పోటీలు నిర్వహించి పలువురు చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతులను కె. చక్రవర్తి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో విజయకృష్ణ సూపర్ బజార్ చైర్మన్ వెలగా సురేష్, అసోసియేషన్ కార్యదర్శి యార్లగడ్డ వెంకట రమేష్, ఉపాధ్యక్షులు జి.సాంబశివరావు, సహాయ కార్యదర్శులు రామిరెడ్డి, జనార్ధనరావు, కోశాధికారి కె.వి.రామయ్య, ఈవెంట్ కన్వీనర్ సీహెచ్ జోజిబాబు, మాజీ అధ్యక్షులు కె.ఎస్ రామచంద్రరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, మందపాటి నరసరాజు, కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ ఇళ్లను వెంటనే పునర్నిర్మించాలి

తాడేపల్లి రూరల్: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో నిర్మించిన పేదల ఇళ్లు శిథిలావస్థకు చేరాయని.. వాటిని వెంటనే పునఃనిర్మించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది చిలువూరి నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద నిర్మించిన ఇళ్లను ఆయన పరిశీలించారు. ఆ ఇళ్లు కూలిపోయే స్థితిలో ఉన్నాయని.. ఎమ్మార్పీఎస్ నాయకుల దృష్టికి సమస్య రావడంతో పరిశీలించామని అన్నారు. చాలా మంది ఆ నివాసాలను ఖాళీ చేసి వేరే చోట అద్దెకు నివాసముంటున్నారని తెలిపారు. అధికారులు, ప్రభుత్వం ఆ ఇళ్లను పరిశీలించి వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కోటేశ్వరరావు మాదిగ, వినుకొండ అబ్రహమ్, కుక్కమళ్ల మరిణమ్మ, బుల్ల దయామణి, దాసు, బుజ్జి, ఏసుదాసు, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్, ప్రభు నగర్ ప్రాంతాల్లో నివాసముంటున్న పేదల నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సీపీఐ నాయకులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ.. పట్టణాల్లో నివసించే పేదలకు 2 సెంట్లు, గ్రామాల్లో నివసించే పేదలకు 3 సెంట్ల భూమిని ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని అన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా పేదల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నామని.. ఆ అర్జీలను ఎంటీఎంసీ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు. సోమవారం మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, నాయకులు షేక్ బాషా, రాజు, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ నేడు

దుగ్గిరాల: వైఎస్సార్‌సీపీ ఈనెల 4వ తేదీన తలపెట్టనున్న వెన్నుపోటు దినోత్సవ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించనున్నట్లు మండల అధ్యక్షులు తాడిబోయిన శివ గోపయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు రైలుపేటలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ ఉంటుందని ఆదివారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

రైల్వే గేటు మూసివేత



ఫిరంగిపురం: మండల కేంద్రం నుంచి సత్తెనపల్లి వెళ్లే దారిలోని అల్లంవారిపాలెం వద్దగల రైల్వే గేటును మరమ్మత్తుల నిమిత్తం శనివారం రైల్వేశాఖ అధికారులు మూసివేశారు. గేటు సమీపంలో మరమ్మత్తులు నిర్వహిస్తున్నారు. పట్టాలు, వాటి చుట్టూ ఉన్న కంకర తొలగించి నూతనంగా ఏర్పాటు వంటి పనులు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులు వసంత నగర్ మీదుగా రైల్వే అండర్‌పాసు కిందుగా ఫిరంగిపురంలోకి వస్తున్నారు. మరో మూడు రోజులపాటు పనులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు కఠిన చర్యలు

మంగళగిరి: రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించమని.. వారికి కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ అన్నారు. ఆదివారం రూరల్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు నేరప్రవృత్తి విడనాడి సత్‌ప్రవర్తనతో మెలగాలన్నారు. భూ దందాలు, సెటిల్మెంట్‌లు, గొడవలక దిగితే ఉపేక్షించేది లేదన్నారు. గొడవలకు దిగే రౌడీషీటర్లపై పీడీయాక్ట్ కేసు నమోదు చేయడమే కాక నగర బహిష్కరణ చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వ్యర్థాలు తొలగింపు

దుగ్గిరాల: రహదారుల వెంట పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చి మొక్కలను సర్పంచ్ గంపల గంగాధర్ ఆధ్వర్యంలో తొలగించారు. పేరుకలపూడి గ్రామంలో ఆదివారం వర్షాలతో అపరిశుభ్రంగా పేరుకుపోయిన చెత్తను క్రేన్‌తో తొలగించి రోడ్లను శుభ్రం చేయించారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్

- అందించాల్సిన బాధ్యత డీలర్లదే..
- తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ


తూములూరులో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సబ్ కలెక్టర్

కొల్లిపర: ఇకనుంచి రేషన్ డీలర్లే స్వయంగా దివ్యాంగులకు, వయోవృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ అందించాలని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ అన్నారు. ఆదివారం తూములూరు గ్రామంలో రేషన్ దుకాణం ప్రారంభోత్సవంలో పాల్గొని బియ్యం పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ తీసుకునే సమయంలో లబ్ధిదారుల వేలి ముద్రలు ఈ–పాస్ లో సరిగా పడకపోతే డీలర్లు అటువంటి వారికి ఐరిస్ ద్వారా రేషన్ అందించాలని సూచించారు. తహసీల్దార్ జి.సిద్దార్థ, ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం

తెనాలిలో ప్రారంభమైన మలేరియా నివారణ మాసోత్సవం


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రియాంక

తెనాలిఅర్బన్: మలేరియా వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వలన మలేరియా వ్యాధి వస్తుందని తెలిపారు. ఒకరి నుంచి మరొకరికి ఇది వ్యాపించే అవకాశం ఉందన్నారు. జ్వరం, వణుకు, చలి, చెమటలు పట్టడం, ఒంటినొప్పులు, తదితర లక్షణాలు దీనికి ఉంటాయన్నారు. రక్త పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే వెంటనే వైద్యశాలలో చూయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా మందులు ఇస్తున్నట్లు చెప్పారు. తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ఆదివారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 2027వ సంవత్సరానికి ఒక్క మలేరియా కేసు కూడా లేకుండా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. 2030 నాటికి మలేరియా రహిత భారతదేశంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ లక్ష్యాల సాధనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ మంచినీటితో దోమలు గుడ్లు పెట్టి తద్వారా దోమల ఉత్పత్తిని పెంచుకుంటాయని తెలిపారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి నాగమల్లేశ్వరరావు, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, సంకా శరత్‌బాబు, ఎ.వేణుగోపాలరావు, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల భారాలపై పోరాటానికి సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

మంగళగిరి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న పన్నుల భారాలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం పార్టీ విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ.. గుంటూరు, ప్రకాశం, కృష్ణ జిల్లాల్లో విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించి భారం మోపే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను భారీగా పెంచిందని అన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పగలగొడతామని చెప్పిన నారా లోకేష్.. నేడు స్మార్ట్ మీటర్లు బిగించడానికి అనుకూలంగా ఉన్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతోందన్నారు. ఎన్నికలకు ముందు మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పరేషన్ మళ్లీ ప్రారంభం!


చినరావూరులో సర్వర్ మొరాయించడంతో మూడు గంటలు వేచిచూసి, అనంతరం రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు


కవెరవరంలో సర్వర్ మొరాయించడంతో క్యూలైన్‌లో వేచియున్న గ్రామస్తులు

రేషన్ దుకాణాలు పునఃప్రారంభమయ్యాయి. ఆదివారం మొదటిరోజు పట్టణ చినరావూరు డిపోరోడ్డులోని షాపు వద్ద పట్టుమని 10 మంది లేకుండా లేరు. సర్వర్ మొరాయింపు కారణంగా లబ్ధిదారులు గంటల తరబడి నిలబడవల్సిన దుస్థితి దాపురించింది. ఆ ప్రాంతానికి చెందిన వృద్ధురాలు నారాబోని వెంకమ్మ మాట్లాడుతూ తాను రేషన్ షాపు వద్ద మూడు గంటలు వేచియున్నానని, సర్వర్ సరిగారాక పోవడం కారణంగా తెలిపింది. గతంలో ఇళ్ల వద్దకు ఎండీయూ ఆపరేటర్లు రేషన్ పంపిణీ చేసేవారని, ప్రస్తుతం డిపోవద్దకు వచ్చి తీసుకువెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. నెత్తిపై బియ్యం మూట పెట్టుకుని దూరం వెళ్లాలని బాధపడింది. అదే విధంగా రూరల్ మండలం కవెరవరం గ్రామంలో రేషన్ దుకాణం వద్ద సర్వర్ మొరాయించడంతో లబ్ధిదారులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడిపోయారు.

– తెనాలిటౌన్


నెత్తిపై బియ్యం మూట పెట్టుకుని వెళ్తున్న వృద్ధురాలు